11-08-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఇప్పుడు మీరు గవ్వ నుండి వజ్ర సమానముగా అయ్యారు, ఈశ్వరుని ఒడిని పొందడమే వజ్ర సమానముగా అవ్వడము, శ్రీమతము మిమ్మల్ని వజ్ర సమానముగా తయారుచేస్తుంది"

ప్రశ్న:- సత్యయుగములో కొందరికి రాజ్య సింహాసనము (రాజ్యాధికారము) మరియు కొందరికి దాస-దాసీ లేక ప్రజా పదవి లభిస్తుంది, దీనికి కారణము ఏమిటి?

జవాబు:- ఎవరైతే సంగమములో జ్ఞానసాగరుని చదువును మంచి రీతిలో చదువుకుంటారో మరియు ధారణ చేస్తారో, జ్ఞాన రత్నాలను దానం చేసి అనేకులను తమ సమానముగా తయారుచేస్తారో, వారికి సత్యయుగంలో రాజ్య సింహాసనము లభిస్తుంది మరియు ఎవరైతే నిర్లక్ష్యం చేస్తారో, దేహాభిమానంలోకి వచ్చి గొడవలు చేస్తారో, వారికి ప్రజా పదవి లభిస్తుంది. చదువు పట్ల శ్రద్ధ పెట్టనివారే దాస-దాసీలుగా అవుతారు.

ఓం శాంతి. మాయా తుఫానులు వస్తాయి అని గవ్వ నుండి వజ్రము వలె అయ్యే సికీలధే (చాలాకాలం తర్వాత కలిసిన), పురుషార్థీ పిల్లలకు తెలుసు. పిల్లలు గవ్వ నుండి వజ్రము వలె అయ్యేందుకు పురుషార్థం చేస్తారు, కానీ శ్రీమతముపై నడవని కారణంగా మళ్ళీ మాయా తుఫానులు రావడంతో జ్యోతి ఆరిపోతుంది. దీని గురించి కూడా పాట ఉంది. మనమే ఒకప్పుడు పూజ్య దేవీ-దేవతలుగా ఉండేవారమని పిల్లలకు ఇప్పుడు తెలిసింది. ఈ విషయాలను ఆత్మ అనంతమైన, అతి ప్రియమైన తండ్రి ద్వారా వింటుంది. వారి గురించి ఈ మహిమ గాయనం చేయబడుతుంది. వారు ఉన్నతోన్నతుడైన భగవంతుడు. మొత్తం సృష్టి అంతటిలో వారినే స్మృతి చేస్తారు ఎందుకంటే ఈ ప్రపంచంలో తప్పకుండా అంతా దుఃఖమే దుఃఖము ఉంది. మనుష్యులందరూ తెలివిహీనులు అని ఈ విధంగా కూడా భావించకండి. ప్రాచీన భారత్ చాలా ఉన్నతంగా ఉండేదని, ఇతర ఖండాలు లేక ధర్మాలు ఉండేవి కావు అని అర్థం చేసుకుంటారు కూడా, అందుకే భారత్ ను ప్రాచీనమైనది అని అంటారు. ఇంతైతే అర్థం చేసుకుంటారు కానీ అది ఎలా అయ్యింది, ఎప్పుడు అయ్యింది, భారత్ మళ్ళీ వజ్ర సమానంగా ఎప్పుడు మరియు ఎలా అవుతుంది - ఇది తెలియదు. ఇప్పుడు పిల్లలైన మీరు సమ్ముఖముగా కూర్చున్నారు మరియు ఎవరైతే పరదేశములో అనగా బయటి సెంటర్లలో ఉంటారో, వారు కూడా వింటారు. వజ్ర సమానముగా తయారుచేసే అనంతమైన తండ్రి అంటారు - ఇది మీ అంతిమ ఈశ్వరీయ జన్మ, ఇప్పుడు భగవంతుడు కూర్చుని వజ్ర సమానముగా తయారుచేసేందుకు మిమ్మల్ని చదివిస్తారు, మరి ఇటువంటి తండ్రి పట్ల ఎంతటి గౌరవాన్ని ఉంచాలి. సత్యమైన తండ్రి, సత్యమైన శిక్షకుడు, సద్గురువుపై గౌరవము ఉంచడం జరుగుతుంది. తండ్రి అంటారు - పిల్లలకు సుఖాన్ని ఇచ్చేవాడిని నేనే. ఈ సమయంలో పిల్లలైన మీకు సుఖాన్ని ఇచ్చేందుకు వచ్చి నా మతాన్ని ఇస్తాను. భగవంతుడు ఏదైతే శ్రీమతాన్ని ఇచ్చారో, దానిని మళ్ళీ మనుష్యులు గీతలో రాసారు, కానీ అది యథార్థముగా లేదు. ఇప్పుడు వీరు మిమ్మల్ని ఉన్నతోన్నతముగా, వజ్ర సమానముగా తయారుచేస్తారు. స్వర్గములోకైతే మీరే రాగలరు కదా. ఆ మాటకొస్తే మొత్తం ప్రపంచంలోని ఆత్మలందరూ తండ్రికి పిల్లలే. ప్రజాపిత బ్రహ్మ అయితే ఉన్నారు కదా. ఈ సమయంలో శివబాబాకు మనుమలుగా పిలువబడతారు. ఆ తర్వాత మునిమనుమలు, మనుమలకు మనుమలుగా కూడా పిలువబడతారు. వృద్ధి అయితే జరుగుతూ ఉంటుంది కదా. వాస్తవానికి అందరికీ రచయితను తండ్రినైన నేనే. మీకు ఎవరు జన్మనిచ్చారు? అని అడుగుతారు కదా. అప్పుడు అల్లాహ్ లేక ఖుదా జన్మనిచ్చారు అని అంటారు. ఈ మాత్రం అర్థం చేసుకుంటారు కానీ ఎలా జన్మనిస్తారు, ఇంతమంది ఎలా వృద్ధి చెందుతారు - ఇదేమీ తెలియదు. సత్యయుగములో రచన చాలా కొద్దిగా ఉంటుందని మీకు తెలుసు. తప్పకుండా కొత్త ప్రపంచాన్ని రచించే రచయిత కూడా ఉంటారు. కొత్త ప్రపంచంలో దేవీ-దేవతా పదవిని ప్రాప్తింపజేస్తారు, కావున తప్పకుండా పాత ప్రపంచ వినాశనాన్ని కూడా చేయిస్తూ ఉండవచ్చు - ఇది ఎవరికీ తెలియదు. లెక్కలేనన్ని పుస్తకాలు, శాస్త్రాలు మొదలైనవి రాస్తారు. ఇవి ఫిలాసఫీకి సంబంధించిన శాస్త్రాలు అని భావిస్తారు. ఫిలాసఫీ అని జ్ఞానాన్ని అంటారు. కానీ జ్ఞాన సాగరుడు ఒక్క పరమపిత పరమాత్మయేనని ఎవరికీ తెలియదు. మీరు వీరి ద్వారా జ్ఞానాన్ని పొంది వజ్ర సమానముగా తయారవుతారు. ఈశ్వరుని ఒడిని పొందడమే వజ్ర సమానమైన జన్మ. వజ్ర సమానముగా తయారుచేసే తండ్రి మనల్ని వజ్రము వలె తయారుచేస్తున్నారు. వీరిదే బలిహారము అని గాయనం చేయబడుతుంది. సత్యయుగములో బలిహారము యొక్క విషయమే లేదు. అక్కడైతే ఈ ఆలోచన కూడా ఉండదు.

ఇప్పుడు మీకు తెలుసు - మనం ఇప్పుడు శూద్రులము కాదు, దేవతలము కాదు. ఇప్పుడు మనం బ్రాహ్మణులము.

మిమ్మల్నే స్వదర్శన చక్రధారులు అని అంటారు. ఇక్కడ మీరు స్వదర్శన చక్రధారులుగా అయి విష్ణు కులములోకి వెళ్ళి రాజ్యం చేస్తారు. స్వదర్శన చక్రధారులుగా, కమలపుష్ప సమానముగా మీరు ఇక్కడే తయారవ్వాలి. ఇక్కడ ఉన్నది పురుషార్థము, అక్కడ ఉండేది ప్రారబ్ధము. ఇటువంటి విషయాలు ప్రపంచంలో ఇంకెవ్వరికీ తెలియవు. తండ్రి అంటారు - మాయ మిమ్మల్ని తుచ్ఛ బుద్ధి కలవారిగా చేసింది. మీరు వజ్ర సమానమైన దేవీ-దేవతలుగా ఉండేవారు. ఇంతకుముందు మీకు తెలియదు. ప్రపంచంలో అనేక మతాలున్నాయి - ఒకరు ఒకటి అంటారు, ఇంకొకరు ఇంకొకటి అంటారు. కొందరేమో, మనుష్యులు మరణిస్తారు, మళ్ళీ కొత్తగా జన్మిస్తారు అని అంటారు. కొందరేమో, ఎటువంటి సంకల్పాలను చేస్తే అలా అయిపోతారు అని అంటారు. అనేక రకాల మతాల వారు ఉన్నారు. మీరు శ్రీమతంపై నడిచేవారు. శ్రీమతము ద్వారా మీది కూడా శ్రేష్ఠమైన మతముగా అవుతుంది. మీకే తెలుసు, అందరూ అయితే తెలుసుకోరు. అయితే కొందరు లక్షాధికారులుగా, పదమపతులుగా ఉన్నారు కానీ ఈ జ్ఞానంలోకి రావడం చాలా కష్టము. కోట్లలో ఏ ఒక్కరో మాత్రమే వస్తారు ఎందుకంటే షావుకారులకు ఎన్నో చిక్కులు ఉంటాయి. పేదవారే ఈశ్వరుని ఒడిని తీసుకుంటారు అని డ్రామాలో ఈ విధంగానే నిశ్చితమై ఉంది. ఈ రథమైతే వారిది కదా. బాప్ దాదా ఇరువురూ కలిసి ఉన్నారు - ఇది మీరే అర్థం చేసుకుంటారు. నిరాకారుడైన భగవంతునికి తమదంటూ శరీరము లేదు కావున తప్పకుండా శరీరాన్ని లోన్ గా తీసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే భగవానువాచ అవుతుంది కదా. శ్రీకృష్ణునిది భగవానువాచ కాలేదు. వారినైతే అందరూ వెంటనే తెలుసుకుంటారు. వీరు నిరాకారుడు, అందుకే వీరి గురించి ఎవరికీ తెలియదు. ఈ రోజుల్లో ఎంతోమంది మనుష్యులు వేషాలను మార్చి కృష్ణుని రూపాన్ని ధరిస్తారు. డబ్బు సంపాదిస్తారు. అందరూ మాయకు ఫాలోవర్స్ గా అయిపోయారు. ఇప్పుడు మీరు ఈశ్వరుని ఫాలోవర్స్ గా అవుతారు. కొందరైతే 100 శాతం ఈశ్వరుని ఫాలోవర్స్ గా అయ్యారు, వారి శరణును తీసుకున్నారు. మిగిలినవారంతా మాయా రావణుడి శరణులో చిక్కుకుని ఉన్నారు. బాబా అర్థం చేయించారు - ముఖ్యంగా భారతవాసులు అందరూ శోక వాటికలో ఉన్నారు. మొత్తం ప్రపంచమంతా లంక. వారు శాస్త్రాలలో హద్దు విషయాలను రాసేసారు. అనంతమైన తండ్రి అనంతమైన విషయాలను వినిపిస్తారు. మీకు తెలుసు - ఇప్పుడు మనం ఈశ్వరుని ఒడిలో ఉన్నాము. మళ్ళీ మనం కొత్త ప్రపంచానికి యజమానులుగా, దేవీ-దేవతలుగా అవుతాము. అక్కడ మాయ ఉండదు. సూర్యవంశీయులు-చంద్రవంశీయులు చాలా షావుకారులుగా ఉంటారు. మళ్ళీ ఎప్పుడైతే వైశ్య వంశీయులుగా అవుతారో అప్పుడు వజ్ర-వైఢూర్యాలతో పొదగబడిన మందిరాలను నిర్మిస్తారు. మొట్టమొదట ఎవరైతే వజ్ర-వైఢూర్యాలతో కూడిన మందిరాలను నిర్మిస్తారో, వారు అలాంటి మహళ్ళలో ఉంటారు, అందుకే భారత్ వజ్ర సమానముగా ఉండేది అని అంటూ ఉంటారు. ఇప్పుడు గవ్వ సమానముగా ఉంది. ఇది ఉన్నదే పతిత ప్రపంచము. భారత్ యే సత్యఖండముగా, పావనంగా ఉండేది. భారత్ యే ఇప్పుడు పతిత ఖండముగా ఉంది, ఇప్పుడు మనం భారత్ ను పావనమైనది అని అనము. ఇప్పుడు మనం పావనముగా అవుతూ ఉన్నాము. అక్కడ ఉన్నదే సంపూర్ణ నిర్వికారీ ప్రపంచము. కృష్ణునికి ఎంత గొప్ప మహిమ ఉంది! వారిని ఊయలలో ఊపుతారు కానీ వారి జీవిత చరిత్ర గురించి తెలియదు.

మీకు తెలుసు - ఇప్పుడు ఇది కలియుగము. భారత్ యే సత్యయుగముగా ఉండేది. తప్పకుండా 84 జన్మలను భారతవాసులే తీసుకోగలరు. మీరు ఎప్పుడైతే మంచి రీతిలో అర్థం చేయిస్తారో అప్పుడే ఒప్పుకుంటారు. ఈ ఈశ్వరీయ ఒడి ద్వారా భారత్ వజ్ర సమానముగా అవుతుంది. యథా రాజా రాణి తథా ప్రజా. ప్రజలు కూడా వజ్ర సమానమైనవారు అని అంటారు. ఇప్పుడు యథా రాజా రాణి తథా ప్రజా అందరూ గవ్వ సమానముగా ఉన్నారు. ఇప్పుడు వజ్ర సమానముగా తయారుచేసే తండ్రి వచ్చారు కావున పూర్తి పురుషార్థము చేయాలి. వజ్ర సమానముగా తయారుచేసే తండ్రితోనే పూర్తి యోగాన్ని జోడించాలి. శివబాబా ద్వారా మనం వైకుంఠానికి యజమానులుగా అవుతామని మీకు తెలుసు. మొత్తం అంతా చదువుపైనే ఆధారపడి ఉంది. చదువు గురించి అందరూ ఆలోచించాలి కదా. ఇంట్లో కార్య-వ్యవహారాలు చేస్తూ కూడా - మేము గాడ్ ఫాదర్ యొక్క విద్యార్థులము అని భావించండి. మన చదువు చాలా సహజమైనది. కనీసం ఒక ఘడియ అయినా వచ్చి తప్పకుండా వినాలి. ఎటువంటి మంచి-మంచి పాయింట్లు వెలువడుతాయి అంటే, వాటితో ఏ సమయములోనైనా అకస్మాత్తుగా ఎవరికైనా బాణం తగులుతుంది, అందుకే మురళిని ఎలాగైనా తప్పకుండా వినాలి. ఒకవేళ వినలేకపోతే ఎలాగైనా సరే చదువును చదువుకోవాలి. ఏర్పాట్లు చేయవచ్చు. మొదట ఒక వారమైనా మంచి రీతిలో అర్థం చేసుకోవాలి, తర్వాత కొత్త-కొత్త పాయింట్లను అర్థం చేసుకోవడానికి తప్పకుండా చదువుకోవాలి కూడా. బాబా చదివిస్తూ ఉంటారు. పాయింట్లు వెలువడుతూ ఉంటాయి. బోర్డుపై కూడా ఈ విధంగా రాయవచ్చు - సోదరీ-సోదరులారా, రండి, మీ అందరినీ ఈ సహజ జ్ఞానము మరియు సహజ రాజయోగము ద్వారా వజ్ర సమానముగా తయారుచేస్తాము. మీ వద్ద చిత్రాలు కూడా అన్నీ ఉన్నాయి. వాటిపై అర్థం

చేయించడం చాలా సహజము. ఏ విధంగా చిన్నపిల్లలకు ఆటబొమ్మలను చూపించి చెప్పడం జరుగుతుంది, వారిని చదివిస్తారు - ఇది ఏనుగు, ఇలా-ఇలా చేస్తుంది; ఇది ఒంటె... అని. మనుష్యులకు కూడా పరమాత్మ గురించి తెలియదు, అలాగే వారు ఏం చేస్తారు అన్నది కూడా తెలియదు. వారి కర్తవ్యము గురించి తెలియకపోతే ఇక మహత్వము ఏమున్నట్లు? కావున చిత్రాలపై అర్థం చేయించవలసి ఉంటుంది - వీరు పరమపిత పరమాత్మ శివుడు, వీరు వజ్ర సమానముగా తయారుచేసేవారు, వీరి నుండి వారసత్వము బ్రహ్మ ద్వారా లభిస్తుంది. బ్రహ్మకుమార-కుమారీలను శివబాబా చదివించి ఈ విధంగా దేవీ-దేవతలుగా తయారుచేస్తారు. వారు చదివించారు కావుననే మనము అర్థం చేయించగలము కదా. పరమపిత పరమాత్మ వచ్చి చదివిస్తారని ఇంతకుముందు తెలియదు. భారత్ వజ్ర సమానముగా ఉండేది, ఇప్పుడు గవ్వ సమానముగా ఉంది అని అర్థం చేయించడం చాలా సహజము. మళ్ళీ గవ్వల వెనుక ఎదురుదెబ్బలు ఎందుకు తింటున్నారు? ఈ ధనము, సంపద మొదలైనవన్నీ మట్టిలో కలిసిపోనున్నాయి. ఇప్పుడు మీరు సత్యఖండము కొరకు సత్యమైన సంపాదనను చేయండి. పూర్తి సంపాదన చేయని కారణంగా పూర్తిగా సాధారణ ప్రజలలోకి వెళ్ళిపోతారు. ప్రజలకు కూడా నౌకర్లుగా అవుతారు. తండ్రికి చెందినవారిగా అయి మళ్ళీ తండ్రిని వదిలి వెళ్ళిపోతారు. కావున బాబా అర్థం చేయిస్తారు - పిల్లలూ, ఇంటికి కూడా మురళిని తెప్పించుకుని చదవచ్చు. మురళి లభిస్తూ ఉంటుంది. ఎక్కడ ఉన్నా సరే మీరు తప్పకుండా చదవాలి. చదవండి మరియు చదివించండి. విదేశాలలో ఉంటూ కూడా మీరు సేవ చేయవచ్చు. తండ్రి పరిచయాన్ని ఇవ్వాలి. ప్రభావమైతే అంతిమంలోనే వెలువడుతుంది. ప్రాచీన భారత్ తప్పకుండా స్వర్గంగా ఉండేది అని అర్థం చేసుకుంటారు. ఇక్కడి నుండి ఎంతటి ధనాన్ని దోచుకుని తీసుకువెళ్ళారు!

సత్యయుగములో చైతన్యంలో మొత్తం సృష్టి అంతటికీ మీరు యజమానులుగా అవుతారు, అనగా రాజ్యం చేస్తారు. మళ్ళీ భక్తి మార్గంలో జడ చిత్రాలను ఒక చిన్న గదిలో పెట్టి మూసివేస్తారు, స్మృతి చిహ్నాలను తయారుచేస్తారు. పూజా సామానులు కూడా కావాలి కదా. మనమందరమూ పూజ్యులుగా ఉండేవారము అని, ఇప్పుడు పూజారులుగా అయ్యాము అని ఇప్పుడు మీరు అంతా తెలుసుకున్నారు. పూజ్యుల నుండి పూజారులుగా అవ్వడానికి మనకు ఎంత సమయం పడుతుంది? మందిరాలు ఎలా తయారయ్యాయి? మనమే మందిరాలను తయారుచేయించాము. మనం మన జడ చిత్రాలను తయారుచేసి మనమే మన పూజను ప్రారంభించాము. ఇవి ఎంత అద్భుతమైన విషయాలు! తండ్రి అర్థం చేయిస్తారు - పిల్లలూ, ఇప్పుడు ఎటువంటి నిర్లక్ష్యము చేయకండి. దేహీ-అభిమానులుగా అవ్వడం ద్వారానే మీరు వజ్రము వలె తయారవుతారు. దేహాభిమానంలోకి రాకూడదు. దేహాభిమానంలోకి వచ్చి పెద్ద-పెద్ద గొడవలు చేసినట్లయితే మిమ్మల్ని మీరూ సర్వనాశనం చేసుకుంటారు మరియు ఇతరులను కూడా సర్వనాశనం చేస్తారు. ఒకే జ్ఞానసాగరుని ద్వారా చదువుకుని కొందరు రాజ్య సింహాసనంపై కూర్చొంటారు, మరికొందరు దాస-దాసీలుగా అవుతారు. చూడండి, లక్ష్మీ-నారాయణులు స్వర్గ రాజ్యాధికారులుగా ఉండేవారు. వారికి ఎంతగా మహిమ, పూజ జరుగుతుంది, మందిరాలను నిర్మిస్తారు. మనం మళ్ళీ సూర్యవంశీ లక్ష్మీ-నారాయణులుగా అవుతున్నాము అని ఇప్పుడు మీకు తెలుసు. తర్వాత సూర్యవంశీయుల నుండి చంద్రవంశీయులలోకి వస్తాము. రాజ్యాన్ని తీసుకోవడము అనేది ఎంత ఉన్నతమైన పదవి. పురుషార్థము ఈ విధంగా చేయాలి మరియు చేయించాలి. ఒకవేళ చేయించడం తెలియకపోతే పురుషార్థం చేయడమే నేర్చుకోలేదు అని అర్థము. తమ సమానంగా తయారుచేయలేకపోతే రాజా-రాణిగా అవ్వలేరు. అవినాశీ జ్ఞాన రత్నాలను దానమివ్వాలి. ఈ నషా చాలా కొద్ది మందికే ఉంటుంది. దేహీ-అభిమానులుగా అయి ఉన్నట్లయితే సంతోషపు పాదరసం ఎక్కుతుంది. మమ్మా-బాబాను చూడండి, ఎంత ఆలోచన ఉంటుంది. ఈ కుమార్తెకు దెబ్బలు పడుతున్నాయి, ఎలా రక్షించాలి అని తండ్రికి దయ కలుగుతుంది. శరణాగతిని ఇచ్చినప్పుడు ఎన్ని గొడవలు జరుగుతాయి. సర్వశక్తివంతుడైన శివబాబా ద్వారా భారత్ కు వజ్ర సమానముగా తయారయ్యే లాటరీ లభిస్తుంది. ఇక్కడ మీరు సమ్ముఖంగా వింటారు, బాగా అనిపిస్తుంది. బాబా డోస్ ఇస్తూ ఉంటారు. పిల్లలు అడుగడుగునా శ్రీమతంపై నడుచుకోవాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. సుఖమిచ్చేటువంటి తండ్రి, టీచర్, సద్గురువు పట్ల గౌరవాన్ని తప్పకుండా ఉంచాలి. వారి మతము అనుసారంగా

నడుచుకోవడమే వారికి గౌరవాన్ని ఇవ్వడము.

2. ఇంటి యొక్క కార్య-వ్యవహారాలను చేస్తూ స్వయాన్ని గాడ్ ఫాదర్ యొక్క విద్యార్థిగా భావించాలి. చదువు పట్ల పూర్తి శ్రద్ధ పెట్టాలి, మురళిని మిస్ చేయకూడదు. సత్యఖండము కొరకు సత్యమైన సంపాదన చేయాలి.

వరదానము:- భూత, భవిష్యత్ మరియు వర్తమానాల గురించి తెలుసుకుని మాయాజీత్ గా అయ్యే మాస్టర్ త్రికాలదర్శి భవ

ఏ పిల్లలకైతే మూడు కాలాల గురించి తెలుసో, వారు ఎప్పుడూ మాయతో ఓడిపోలేరు ఎందుకంటే వర్తమానం ఏమిటి మరియు భవిష్యత్తులో ఏమి జరుగనున్నది, ఈ రెండూ త్రికాలదర్శి ఆత్మల బుద్ధిలో స్పష్టంగా ఉంటాయి. నేను ఏమిటి మరియు ఎలా అవ్వనున్నాను, వర్తమానము మరియు భవిష్యత్తు - ఈ రెండింటి నషా వారికి ఉంటుంది. అదే నషా యొక్క సంతోషంలో ఎగురుతూ ఉంటారు, అందుకే వారి పాదాలు భూమి కన్నా పైన ఉంటాయి. వారు దేహము, దేహ సంబంధాలు, దేహానికి సంబంధించిన పాత పదార్థాల ఆకర్షణలోకి రారు.

స్లోగన్:- ఎవరి వద్దనైతే సరళతా గుణము ఉంటుందో, వారికి సంగఠనలో నడుచుకోవడము చాలా సహజము.